క్లుప్తంగా

హత్య దురదృష్టకరం



గుంటూరు ఈస్ట్: నగరంలో బుధవారం దోపిడీ దొంగలు హతమార్చిన బత్తుల సాంబశివరావు నివాసానికి మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం గురువారం వెళ్లారు. సాంబశివరావు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి తనవంతు సాయంగా రూ.50వేలు అందజేశారు. ఏసురత్నం మాట్లాడుతూ దురదృష్టకర ఘటన అని పేర్కొన్నారు. సాంబశివరావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. మిర్చి వ్యాపారి సుధాకర్ తనవంతు సాయంగా మృతుని కుటుంబానికి రూ.10వేలు అందజేశారు.

నేత్రపర్వంగా ధైర్యలక్ష్మి నారాయణుల కల్యాణం

పాతగుంటూరు: అరండల్‌పేట నాలుగో లైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానంలో (అష్టావింశతి) వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం ఆలయ ప్రధానాచార్యులు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో శ్రీచక్ర అభిషేకాలు, విశేష పూజలు చేశారు. వేద మంత్రాల నడుమ ధైర్యలక్ష్మీ నారాయణుల కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. కల్యాణంలో సువాసినులచే కుంకుమపూజ అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, రక్షాధారణ, నవగ్రహారాధన, మాంగల్య పూజ నిర్వహించారు.

ఉచితంగా వినికిడి పరీక్షలు

గుంటూరు మెడికల్: ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 3 నుంచి 10 వరకు ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్నేహిల్ స్పీచ్ అండ్ హియరింగ్ రీహాబిలిటేషన్ సెంటర్ అధినేత, ఆడియాలజిస్టు అండ్ స్పీచ్ పెథాలజిస్టు ఆర్.శిరీష తెలిపారు. స్థానిక కొత్తపేట డాక్టర్స్ ప్లాజా బిల్డింగ్‌లోని తమ సెంటర్‌లో ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతోందని పేర్కొన్నారు. వినికిడి లోపం ఉన్న వారికి రాయితీపై యంత్రాలు ఇస్తామని వెల్లడించారు.

పోలీస్ కుటుంబాలకు చేయూత చెక్కుల పంపిణీ

నగరంపాలెం: గతనెల 22, 23 తేదీల్లో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బీఎస్‌ఆర్‌కే ప్రసాద్, కానిస్టేబుల్ పి.అక్వేశ్వరరావు వేర్వేరు కారణాలతో మృతిచెందారు. ఈ క్రమంలో ఒక్కొక్కరికి చేయూత పథకం ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కులను వారి కుటుంబ సభ్యులకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కిటెక్చర్ విద్యార్థినికి అభినందన

ఏఎన్‌యూ: జాతీయ స్థాయి యువజనోత్సవాలలో రజత పతకం సాధించిన ఏఎన్‌యూ ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థిని సీహెచ్ హెలీన విజయ సుందరిని గురువారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అభినందించారు. హెలీన ఇటీవల బెంగళూరులోని జైన్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి యువజనోత్సవాలలో రంగోలి అంశంలో ప్రతిభ కనబరిచి 3వ స్థానాన్ని కైవసం చేసుకుందని వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఫైబ్రో స్కాన్‌తో లివర్ పనితీరు తెలుసుకోవచ్చు



గుంటూరు మెడికల్: ఫైబ్రో స్కాన్‌తో లివర్ పనితీరు తెలుసుకోవచ్చని డయాబెటాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ నాగూర్ బాషా చెప్పారు. స్థానిక గుంటూరు వారి తోట 7వ లైన్‌లోని కేర్ వెల్ హాస్పిటల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం జరిగిది. సుమారు రూ.10 వేల విలువ చేసే ఫైబ్రో స్కాన్ వ్యాధి నిర్ధారణ పరీక్షను 60 మందికి చేశామని డాక్టర్ నాగూర్‌బాషా తెలిపారు. పేదలు తమ హాస్పిటల్‌లో ప్రతినెలా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు వినియోగించుకోవాలని కేర్‌వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ బాషా కోరారు.

అంతర్ కళాశాలల క్విజ్‌లో ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విట్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ కళాశాలల క్విజ్ పోటీల్లో టీజీపీఎస్ పీజీ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తెలిపారు. పట్టాభిపురంలోని టీజీపీఎస్ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో బహుమతులు పొందిన విద్యార్థులు కె.హేమలత, కె. వెంకటేశ్వర్లు, పి. పవిత్ర, పి. అరుణ, ఆర్.అజయ్, బి. చంద్రశేఖర్‌రెడ్డిని ఆమె అభినందించారు.

నిబద్ధతతో కూడిన జీవితం కృష్ణారెడ్డి సొంతం

- కుటుంబానికి అండగా నిలుస్తాం
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సజ్జల

గుంటూరు రూరల్: నిజాయతీ, నిబద్ధతతో కూడిన జీవితం తనుబుద్ధి కృష్ణారెడ్డి సొంతమని ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల హఠాన్మరణం పొందిన కార్పొరేటర్ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల్ని గురువారం రెడ్డిపాలెంలోని వారి స్వగృహంలో సజ్జల పరామర్శించారు. కృష్ణారెడ్డి అకాల మరణంపై ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎంతో కాలంగా రాజకీయాల్లో ఉంటున్నప్పటికీ స్వలాభాపేక్ష లేకుండా నిత్యం సమాజ అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో వ్యవహరించే కృష్ణారెడ్డి పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తారని తెలిపారు. ఆయన అకాల మరణం కుటుంబానికి మాత్రమే కాకుండా పార్టీకి కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఇటు పార్టీకి, అటు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ఆలోచనా విధానానికి అనుగుణంగా పేద ప్రజానీకానికి కృష్ణారెడ్డి చేసిన సేవల్ని పార్టీ ఎన్నటికీ మరువబోదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా నిలుస్తుందని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ కృష్ణారెడ్డి మరణంతో పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. మంచితనానికి మారుపేరైన ఆయన మన మధ్య లేకపోవడం నిజంగా దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ రాజకీయం, నిజమైన ప్రజాసేవకు కృష్ణారెడ్డి జీవితమే ప్రత్యక్ష నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎంత నిజాయతీగా ఉన్నప్పటికీ ఎంతో కొంత వ్యతిరేకత ఎదుర్కొనడం ఎవరికైనా సహజమే కానీ, కృష్ణారెడ్డి గురించి ఒక్కరు కూడా వ్యతిరేకంగా మాట్లాడిన వారు లేరని తెలిపారు. గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఏకగ్రీవంగా ఎన్నికై తన డివిజన్ వేగంగా అభివృద్ధి చెందడంలో క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా మాట్లాడుతూ పది మందికి మంచి చేస్తూ ముందుకు సాగే మనస్తత్వం గల కృష్ణారెడ్డి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సున్నిత మనస్కుడు, సాధు స్వభావి అని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికే పరితపించే వ్యక్తిత్వం గల కృష్ణారెడ్డి అకాల మరణం ఈ ప్రాంత ప్రజలకు కూడా తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, పార్టీ నేతలు బందా రవీంద్రనాథ్, ఈచంపాటి వెంకటకృష్ణ , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పెద్ద సంఖ్యలో కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ అజెండా

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- 43వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

కొరిటిపాడు(గుంటూరు): అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. గురువారం 43వ డివిజన్‌లో 136వ సచివాలయం పరిధిలోని ముత్యాలరెడ్డి నగర్‌లో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు మందాల కోటిరెడ్డితో కలిసి గిరిధర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను ఆరా తీశారు. స్థానిక సమస్యలపై చర్చించి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్ది, విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి డిజిటల్ విద్యను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించారని చెప్పారు. కార్యక్రమంలో 43వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మందాల కోటిరెడ్డి, 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కలూరి మారుతి, పార్టీ నాయకులు కరుణాకరరెడ్డి, పీర్ మహ్మద్(బుజ్జి), యక్కలూరి కోటిలింగారెడ్డి, ధనావత్ వెంకటేశ్వర్లునాయక్, జె.శివరామిరెడ్డి, పొగర్తి రవీంద్ర, దారా ప్రేమ్, అంబేద్కర్, సంబంధిత అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఏసురత్నం, కోటిరెడ్డి తదితరులు

పారదర్శకంగా వైద్య ఉద్యోగుల ఎంపిక

డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు



గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం వైద్యాధికారుల పోస్టులు–37, స్టాఫ్ నర్సుల పోస్టులు– 70, ఇతర పారా మెడికల్ సిబ్బంది పోస్టులు–30 మొత్తం 137 ఉద్యోగాల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూల ద్వారా దరఖాస్తులు స్వీకరించామని, అన్ని పోస్టులకు కలిపి 4,714 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులు పరిశీలించిన తదుపరి మెరిట్ జాబిత ప్రచురిస్తామని తెలిపారు. దానిపై అభ్యంతరాలు స్వీకరించి తదుపరి రోస్టర్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ అనుమతితో ఉద్యోగాల నియామకపు ఉత్తర్వులు అందిస్తామన్నారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా, అభ్యర్థుల మెరిట్, రోస్టర్ ప్రకారం మాత్రమే ఉద్యోగ నియమకాలు జరుగుతాయన్నారు. ఎవరి ద్వారా సిఫార్సులు పరిగణలోకి తీసుకోరని, డబ్బు ప్రలోభాలకు లోబడి అభ్యర్థులు దళారీలను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని డాక్టర్ శ్రావణ్‌బాబు సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్



లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: యూనివర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్మించనున్న లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ భవనానికి గురువారం వీసీ భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, పరిశోధనలకు మౌలిక వసతులు ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, పాలకమండలి సభ్యురాలు ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, ప్రిన్సిపాల్స్ ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి, యూనివర్సిటీ అధికారులు ఆచార్య ఎల్ ఉదయకుమార్, ఆచార్య చెన్నారెడ్డి, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ భవనం నాగకిషోర్ పాల్గొన్నారు.

19 మందికి మొబైల్ ఫోన్ల అప్పగింత



బాధితులకు ఫోన్లు అప్పగించిన ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు తిరిగి వాటిని రికవరీ చేసి పోలీసులు అప్పగిస్తున్న తీరు ప్రశంసలందుకుంటోంది. ఇప్పటి వరకు దాదాపు 40మందికి పైగా బాధితులకు ఫోన్లు అప్పగించారు. తాజాగా మరో 19 మందికి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్, జిల్లా సెల్‌ఫోన్ వాట్సాప్ నోడల్ అధికారిణి, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అందించారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే వాట్సాప్ నంబర్ 8688831574కు వివరాలు పంపితే వెంటనే రికవరీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ బి.నరసింహా, ఐటీ కోర్ ఇన్‌ఛార్జ్ ఎస్ఐ డి.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎం.డి.నిసార్‌బాషా హెచ్చరించారు. గురువారం పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబరు ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను పట్టుకున్నారు. 48 ద్విచక్రవాహనాలు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అనేక వాహనాలకు చలానాలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో వాటిపై దృష్టి సారించారు. 48 బైక్‌లకు జరిమానాలు విధించారు.

కర్రసాములో విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జైపూర్‌లో గత నెల 24, 25, 26 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి కర్రసాము పోటీల్లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారని పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని సీతారామయ్య పాఠశాలలో గురువారం విద్యార్థినుల అభినందన కార్యక్రమం జరిగింది. బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న 7వ తరగతి విద్యార్థిని బుసాపురం హర్షవర్ధిని అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

విద్యార్థుల ప్రగతిపై పర్యవేక్షణ అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని గుంటూరు ఎంఈఓ ఎస్ఎంఎం అబ్దుల్ ఖుద్దూస్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో గుంటూరు నగర వార్డు సచివాలయాల పరిధిలోని 200 మంది విద్యా కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, అమ్మఒడి పథకాల అమలు ఎంతో కీలకమని చెప్పారు. విద్యార్థుల ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. విద్యా కార్యదర్శుల బాధ్యతలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

వేగంగా రోడ్ల విస్తరణ పనులు



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఆ తర్వాత డ్రెయిన్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. పెద్ద పలకలూరు రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయని, డ్రెయిన్ పనులూ జరుగుతున్నాయని, ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కోర్టు కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు కోర్టు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీపీఎస్ సువర్ణ కుమార్‌కు చార్జి మెమో జారీ చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. కోర్టు కేసుల విషయంలో లీగల్ సెల్ విభాగంతో సమన్వయం చేసుకోవాలని, విభాగ గుమాస్తాలకూ కేసులు బాధ్యత అప్పగించాలని చెప్పారు. మీడియా డివైజ్ ఫీజులపై సమీక్షించి, బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. రోడ్ల విస్తరణ జరుగుతున్న ప్రాంతాల్లో టీడీఆర్ బాండ్ల జారీ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. సమావేశంలో సిటీ ప్లానర్ మూర్తి, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏసీపీలు కాలేషా, బాబురావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, అజయ్ కుమార్, టీపీఎస్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతికత రంగాల్లోనూ రాణించాలి

- ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి
- మలినేనిలో అట్టహాసంగా సంస్కృతి–23 ఫెస్ట్



మాట్లాడుతున్న కమిషనర్ నాగరాణి

పుల్లడిగుంట (ప్రత్తిపాడు): విద్యతో పాటు శాస్త్ర, సాంకేతికత రంగాల్లోనూ యువత రాణించాలని ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సంస్కృతి–23 ఫెస్ట్ అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఫెస్ట్‌లో తొలి రోజు గురువారం పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్‌ల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం క్రీడా, నృత్య, సంగీతల పోటీల్లో యూత్ తమ సత్తాను చాటుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ నాగరాణి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లోనూ తమ నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. అప్పుడే జీవితంలో అనుకున్న లక్ష్యాలను అధిగమించడం సాధ్యపడుతుందన్నారు. హైదరాబాద్ సంస్కార ఫౌండేషన్ చైర్మన్ టి.జ్యోత్స్న మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచే పెద్దల పట్ల గౌరవ మర్యాదలు, మన సంస్కృతి సంప్రదాయాలపై వివరించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఏది మంచి, ఏది చెడు అన్న విషయాలను ఎప్పటికప్పుడు వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. ఏఎన్‌యూ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ హెడ్ డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, విద్యార్థిగా ఉన్నప్పుడే జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవాలని సూచించారు. పాఠశాల విద్యా ఆర్జేడీ జీవీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టాలన్నారు. రాత్రి నిర్వహించిన సినీ డీజే మ్యూజికల్ నైట్ యువతను ఉర్రూతలూపింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, కన్వీనర్ డాక్టర్ డి శ్రీనివాసకుమార్, ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, డీన్ జె కిషోర్‌బాబు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పుల వల్లే హృద్రోగాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆహార నియమాలు, జీవనశైలిలో మార్పుల వల్లే చిన్నవయసులోనూ హృద్రోగ సమస్యలు తలెత్తుతున్నాయని రమేష్ హాస్పిటల్స్ వైద్య నిపుణుడు సుకూర్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీపీఆర్ చేయడంపై అవగాహన కల్పించారు. రమేష్ హాస్పిటల్స్, రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుకూర్‌తోపాటు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్షురాలు కందిమళ్ల స్వప్న విద్యార్థులకు శిక్షణ కల్పించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ఏడుకొండలు, కోశాధికారి వీరయ్య, కళాశాల డైరెక్టర్ డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్, చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, సమన్వయకర్త సుస్మిత పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవ విశేషాలను వివరిస్తున్న ప్రసన్నానందగిరి స్వామి, సువీరానందస్వామి

పాతగుంటూరు: బృందావన్ గార్డెన్స్ కంచి కామకోటి పీఠ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం నాదస్వరం, బెండపూడి లక్ష్మీకుమారి సత్సంగ్ సభ్యుల స్వాగతాంజలితో వైభవంగా ప్రారంభమయ్యాయి. అగ్నిహోత్రం శోభనాచల లక్ష్మీనరసింహాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం, దీపారాధన, గరుడారాధన, ధ్వజారోహణ నీరాజనం, మంత్రం పుష్పం అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగాయి. తర్వాత సభకు ఆలయ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య అధ్యక్షత వహించారు. అతిథులుగా నూతలపాటి తిరుపతయ్య, మోదుగుల పాపిరెడ్డి పాల్గొన్నారు. ఉపన్యాస కార్యక్రమంలో ప్రసన్నానందగిరి స్వామి, చిన్మయ మిషన్ సువీరానందస్వామి పాల్గొని అనుగ్రహభాషణ చేశారు. బ్రహ్మోత్సవ విశేషాలను వివరించారు. విశ్రాంత ప్రాచార్యులు విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి శ్రీ వేంకటేశ్వర మహత్యం, బ్రహ్మోత్సవ వైభవం, తిరుమలేశుని విశేషాలు వివరించారు. కార్యక్రమాలను బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, ఆలయ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పర్యవేక్షించారు.

గృహ కార్మికుల సమాఖ్య కొత్త కార్యవర్గం

గుంటూరు ఎడ్యుకేషన్: గృహ కార్మికుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఆర్.దుర్గ, సీహెచ్ సంపూర్ణ జ్యోతి ఎన్నికయ్యారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో గురువారం మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్, ఎంఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పల్నాడు డీఈఓ తీరు మార్చుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులను అవమానపరిచేలా మాట్లాడిన పల్నాడు డీఈఓ ఎం.వెంకటప్పయ్య తన తీరు మార్చుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, ఎండీ ఖాలీద్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతనెల 28న వినుకొండలో నిర్వహించిన విద్యాశాఖ సమీక్షలో భాగంగా ఉపాధ్యాయులను యూజ్‌లెస్‌ఫెలోస్ అంటూ చేసిన వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పేర్కొన్నారు. గతంలో వెంకటప్పయ్య సమగ్రశిక్ష ఏపీసీగా ఉన్న సమయంలో జేవీకే కిట్ల దుర్వినియోగంపై ఆరోపణలు వచ్చాయని, వీటితోపాటు ఉపాధ్యాయులపై చేసిన వ్యాఖ్యలపైనా ఆర్జేడీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

బీజేపీ విజయోత్సవం

గుంటూరు మెడికల్: ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో గెలుపొందడంతో బీజేపీ శ్రేణులు ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శంకర్ విలాస్ కూడలిలో సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో అమ్మిశెట్టి ఆంజనేయులు, వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాచమల్లు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విష్ణునగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో నివశించే జాగర్లమూడి రామకృష్ణ (66) భార్య ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందింది. పిల్లలు దూరంగా ఉండడంతో రామకృష్ణ ఒంటరిగా జీవిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసికంగా కుంగిపోయి విషం తిని టెర్రస్‌పైకి వెళ్లి పంపునకు వైర్లతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో పోటీతత్వం

పాతగుంటూరు: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని సెయింట్ ప్యాట్రిక్స్ స్కూల్ డైరెక్టర్ పాగోలు సాయిబాబు చెప్పారు. గురువారం ప్యాట్రిక్స్ స్కూల్‌లో సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. పలు అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. 9వ తరగతి విద్యార్థినులు షమీనా, దివ్య మేఘన, చేసిన బయోడైవర్సిటీ (జీవ వైవిధ్యం) నమూనా ప్రతిభకు అద్దం పట్టింది.